క్లుప్తంగా

113 మందికి వైద్య పరీక్షలు


రోగిని పరీక్షస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): శ్రీ కృష్ణ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 113 మందికి పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన వైద్య సలహాలు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ తాను వైద్య వృత్తిలోకి వచ్చి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.. సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గత 24 నెలలుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, రోగులకు రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత స్కానింగ్, ఎక్స్‌రే నిర్వహించి, ఆరోగ్య సూచనలు అందిస్తున్నామని వివరించారు. శిబిరంలో ఆస్పత్రి సిబ్బంది, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రామకోటి ప్రాంగణంలో శనివారం ఏలూరు లయన్స్ క్లబ్ విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బీవీఎం నగేష్ బృందం 117 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఉడతా రత్నకుమార్ ప్రారంభించారు.

వరద బాధితులకు చేయూత

ఏలూరు రూరల్ : వరద బాధితులకు క్రైస్తవ మత పెద్దలు చేయూత అందించారు. శనివారం జాలిపూడి చర్చి ఫాదర్ ఆంతోనిరాజు ఆధ్వర్యంలో పలువురు క్రైస్తవులు ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామస్తులకు సాయం చేశారు. బియ్యం, దుప్పట్లు అందజేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 2023 జూలై నుంచి 12వ పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉన్నా, అమలు కాలేదని పేర్కొన్నారు. 11వ పీఆర్‌సీ అమలు సందర్భంలో జరిగిన నష్టాన్ని ఈ పీఆర్‌సీలో సరిదిద్ది న్యాయం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు.

రోగులకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): వైద్యం కోసం ఏలూరు, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా వినతి పత్రం పంపించామని తెలిపారు.

జాబ్ మేళాలో 566 మంది ఎంపిక

ఏలూరు (టూటౌన్): స్థానిక గిరిజన్ భవన్‌లో శనివారం నిర్వహించిన జాబ్ మేళా నందు 566 మంది ఎంపికయ్యారు. ఈ మేళాకు 1,226 మంది హాజరయ్యారు. మొత్తం 11 కంపెనీలు ఎంపికలు నిర్వహించాయి. మేళాను ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణేష్ నిమజ్జన ఊరేగింపులను పురస్కరించుకుని స్థానిక ఒన్‌టౌన్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. మెయిన్ బజార్, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జలవారి చెరువు ఏరియా, గడియార స్తంభం ఏరియా, కుండీ సెంటర్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లివారి పేట, కెనాల్ రోడ్, పెరుగుచెట్టు ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

వరద బాధితులకు విరాళం

పెదపాడు: వట్లూరులోని శ్రీ రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టరు కె.సాయి రోహిత్ వరద బాధితుల సహాయార్థం రూ.5లక్షల విరాళాన్ని అందించారు. శనివారం సంబంధిత విరాళానికి చెందిన చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి అందించినట్టు సాయి రోహిత్ తెలిపారు.

ఏచూరికి నివాళి

ఏలూరు (టూటౌన్): కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి అని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక అన్నే భవన్‌లో ఐద్వా నాయకురాలు పి.హైమావతి అధ్యక్షత వహించిన సమావేశంలో శ్యామలారాణి మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల నుంచి కమ్యూనిస్టు ఉద్యమ నేతగా ఎదిగారన్నారు. ఏచూరి మరణం మహిళా ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జి.శారద, కె.సుకన్య, లక్ష్మి, ప్రసన్న, కె.జనని, సంజన, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆగ్రహం

- నేడు చలో విజయవాడకు పిలుపు
- రేపటి నుంచి పీహెచ్‌సీల్లో వైద్య సేవల బంద్


ఏలూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యుల నిరసన

ఏలూరు టౌన్: గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పేద ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో వైద్యసేవలు అందించాలనే ఉన్నత లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగం బలోపేతానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. నేడు కూటమి ప్రభుత్వం పీజీ వైద్య విద్యలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్‌ను ఎత్తివేస్తూ జారీ చేసిన జీఓ 85పై పీహెచ్‌సీ వైద్యులు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరు మారకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే ఎంబీబీఎస్ వైద్యులకు గత ప్రభుత్వం పలు రాయితీలు కల్పించింది. నిపుణులైన స్పెషలిస్ట్ వైద్యులను గ్రామాలకు పంపుతూ మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో పనిచేసింది. పీహెచ్‌సీల్లో మూడేళ్ల పాటు వైద్య సేవలు అందిస్తే.. నీట్ పీజీ కౌన్సిలింగ్‌లో 30 శాతం రిజర్వేషన్ కల్పించింది. ఈ రిజర్వేషన్‌లో కోత విధిస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్తగా జీఓ 85ను తీసుకొచ్చింది. కేవలం 15 శాతం రాయితీ కల్పిస్తామని పేర్కొనడంపై పీహెచ్‌సీ వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీఓ రద్దుకు డిమాండ్

పీజీ కౌన్సెలింగ్‌లో 6 బ్రాంచ్‌లకు మాత్రమే ఈ రాయితీ వర్తించేలా నిబంధనలు విధించటంపైనా వైద్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, ఎనస్తీషియా, ఓబీ గైనికాలజీ వంటివాటిలో మాత్రమే 15 శాతం రాయితీ కల్పించటం సరికాదంటున్నారు. మొత్తంగా క్లీనికల్స్, నాన్ క్లీనికల్స్‌లో 19 బ్రాంచ్‌లు ఉండగా 6 బ్రాంచ్‌లకు రిజర్వేషన్ వర్తించేలా జీఓ ఇవ్వటంపైనా పీహెచ్‌సీ వైద్యుల్లో ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

దశలవారీ పోరాటం

జీఓ 85పై ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఇప్పటికే దశలవారీ పోరాటం చేస్తూ ఉండగా, నేడు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో 62 పీహెచ్‌సీలు ఉండగా ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు పనిచేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సోమవారం నుంచి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

జీఓ 85 రద్దు చేయాలి



జీఓ 85ను వెంటనే రద్దు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించటం ద్వారా పీజీ కోర్సుల్లో రిజర్వేషన్ అమలు చేస్తారనే ఆశతో పనిచేస్తున్నాం. కానీ రాయితీలో కోత విధించడ దారుణం. ఇలాంటి నిర్ణయాల వల్ల పీహెచ్‌సీల్లో పనిచేసేందుకు వైద్యులు ఎవరూ ముందుకు రారు.

– డాక్టర్ ఆర్ఎస్ జ్యోత్స్న, ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

పునరాలోచించాలి



పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోర్సుల్లో కల్పించే రాయితీని 15 శాతానికి తగ్గించటం సరికాదు. దీంతో పీహెచ్‌సీ వైద్యులంతా అసంతృప్తితో ఉన్నారు. ఇలాంటి నిర్ణయాలతో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోయే పరిస్థితులు వస్తాయి. పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలి.

– డాక్టర్ ఆర్ గంగాభవానీ, ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు

ఏళ్ల తరబడి సేవలు



ప్రభుత్వం తమ సేవలను గుర్తించి పీజీ కోర్సుల్లో చేరేందుకు రాయితీలు ఇస్తుందనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజలకు సేవలు అందించటం, తమకు రిజర్వేషన్ అమలు చేస్తారనే ఆశతో పనిచేస్తున్నాం. రాయితీలను కుదించటం దారుణం. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం.

– డాక్టర్ కె.పూర్ణచంద్రకుమార్, ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ

వైభవంగా వినాయక కల్యాణం


సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత లక్ష్మీ గణపతి స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీ రామాలయం వద్ద వినాయక మండపంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు దంపతులు స్థానిక మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

అన్న సమారాధనలు

కొత్తపేట దాసరి ఎర్రయ్య వీధిలో లక్ష్మీ గణపతి మహోత్సవాల సందర్భంగా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. 50వ డివిజన్ ఎస్ఎంఆర్ నగర్ ఆర్చి వద్ద గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధనను నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పెదబాబు ప్రారంభించారు. సుమారు 2 వేల మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. పాతూరి శ్రీను, గంటా మోహనరావు తదితరులు పాల్గొన్నారు. బెనర్జీ పేట ప్రాంతంలో ఏలూరు మార్కెట్‌యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు యర్రా శ్రీనివాసరావు, గంగరాజు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనానికి లోక్ అదాలత్ దోహదం


సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : మానసిక ప్రశాంతతో జీవించడానికి జాతీయ లోక్ అదాలత్ దోహదం చేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఇతర న్యాయమూర్తులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కక్షిదారులు కోర్టు కేసుల నుంచి విముక్తి పొంది, సంతోషంతో జీవించడానికి జాతీయ లోక్ అదాలత్ దోహదపడుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు ,సమయం వృథా చేయకుండా లోక్ అదాలత్ ద్వారా కేసుల నుంచి విముక్తి పొందాలని కోరారు. అడిషనల్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది నిర్వహించిన రెండో జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ పరిష్కారంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో 5వ స్థానం పొందిందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీల వారు రాజీ పడటం వల్ల ఇద్దరూ గెలిచినట్టేనని వివరించారు. ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లా మొదటి స్థానం సాధించాలన్నారు. న్యాయవాది టి.సుబ్బారావు, జడ్జిలు ఎస్ వాసుదేవ్, ఎండీ అబుతాలిబ్ ఫర్వీజ్ షేక్, డీసీఆర్బీ సీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యం సాధించాలి


కరాటేలో పోటీ పడుతున్న చిన్నారులు



సినీ నటుడు సుమన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యుద్ధ క్రీడా విద్యల్లో ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ షాటోఖాన్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్-2024 పోటీలను ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రస్తు సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తమను తాము రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడతాయన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి బాలికలు చిన్న వయసు నుంచే మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకుంటే మంచిదని సూచించారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా శారీరక ధారుఢ్యం, మంచి ఆరోగ్యం సొంతమౌతాయని వివరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటున్న క్రీడాకారులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహకులు ఇబ్రహీం బేగ్ మాట్లాడుతూ వివిధ వయసుల వారికి పలు విభాగాల్లో కుమితి, కటా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలకు దేశంలోని 11 రాష్ట్రాల నుంచి కరాటే క్రీడాకారులు ఉత్సాహం పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలు ఆదివారం కూడా కొనసాగుతాయని, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని చెప్పారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన కరాటే ప్రదర్శన అతిథులను విశేషంగా అలరించింది. అనంతరం ఎమ్మెల్యే చంటి, సినీనటులు సుమన్‌తో పాటు పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి, జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు, బీజేపీ నేత నాగం శివ, సామాజికవేత్త చప్పిడి సత్యనారాయణ, కొట్టు మనోజ్, కరాటే పోటీల నిర్వాహకులు డీఎల్ నారాయణ, అంతర్జాతీయ రిఫరీ హన్సీ పరమ్ జిత్ ఎస్ సింగ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


క్యాన్సర్‌పై అవగాహన కరపత్రం విడుదల చేసిన అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. శనివారం స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద ఆఫీసర్స్ క్లబ్ సహకారంతో జీఎస్ఎల్ ట్రస్ట్ క్యాన్సర్, రీసెర్చ్ సెంటర్, ఏలూరు హేలాపురి రూరల్, ఏలూరు దుర్గా తేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను ఉపయోగించుకొని ఆరోగ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంప్‌ను సందర్శించి మాట్లాడారు. లయన్స్ క్లబ్‌లు చేసే సేవల ద్వారా ప్రయోజనం పొందాలని ప్రజలకు సూచించారు. లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ వీకే పంక జాక్సన్, క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్‌లో పాల్గొన్న డాక్టర్ విజయ చలక్కాడ్ రవి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధుల తర్వాత అత్యధికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య క్యాన్సర్ అని, ఏటా సుమారు 7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ముందుగా గుర్తించి సరైన సమయంలో చికిత్స చేయించుకుంటే మరణాల సంఖ్య తగ్గుతుందని వివరించారు. వి.శేషుకుమార్, ఎం కృష్ణ మోహన్‌ల సహకారంతో మందులు పంపిణీ చేశారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కలిగించే కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో హేలాపురి రూరల్ క్లబ్ అధ్యక్షుడు ఎంవీవీఎస్ నాగేశ్వరావు, దుర్గాతేజ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గీతా పంకజ్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి ఎంవీ కృష్ణారావు, క్యాంప్ కోఆర్డినేటర్స్ వి.రామారావు, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరావు, రీజియన్ చైర్మన్ ఎం కృష్ణమోహన్, నాయకులు వెలగపూడి విష్ణుకుమార్, డీవీ రమణ, ఎం శ్రీహరి, డాక్టర్ డి.సరస్వతి, వి.శ్రీనివాస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కు నివాళి


అశోక్ శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జయప్రకాష్


మాజీ ఎమ్మెల్యే వాసుబాబును పరామర్శిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్ : చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని, గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఆపార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. అశోక్ భౌతికకాయానికి ఆయన సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి దేవుడు మనోస్థైర్యం ఇవ్వాలని, అండగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మావయ్య సంకు పుల్లారావు (బువ్వనపల్లి మాజీ సర్పంచ్) ఇటీవల మృతి చెందడంతో వాసుబాబును వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పరామర్శించారు. పుల్లారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృత్రిమ అవయవాల అందజేత


కృత్రిమ అవయవాలతో చిన్నారి

ఏలూరు (టూటౌన్): జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు శనివారం కృత్రిమ అవయవాలను అందజేశారు. స్థానిక దొండపాడులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరపీ, యూడీఐడీ, నిరామయ హెల్త్ కార్డులు మొదలగు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దివ్యాంగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 73865 65469, 08812 249297లో సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస రెడ్డి, దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలకు చెక్ పెట్టాలి


ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ : వ్యక్తిగత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇళ్లలో చోరీలను నివారించేందుకు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. ఏలూరు సత్రంపాడు సాయిమధు ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో శనివారం ఆయన ఇళ్లలో చోరీల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగాన్ని వివరించారు. ఊళ్లు వెళ్లే సందర్భంలో సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే మీ ఇంటి వద్ద అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, వాటిని సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. సీసీకెమెరాలను పోలీసులతో పాటు సంబంధిత ఇంటి యజమాని సైతం తమ మొబైల్ ఫోన్లల్లో చూసుకుంటూ పర్యవేక్షించుకునే అవకాశం ఉందని వివరించారు. అపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేసుకునే సీసీ టీవీల ఫుటేజ్ స్టోరేజ్‌ను నెలరోజులు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానితులపై వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

డ్రోన్లతో సేంద్రియ కషాయాల పిచికారీ

ఏలూరు రూరల్ : రసాయనాలు వద్దు.. ప్రకృతి వ్యవసాయం ముద్దు అంటూ ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం చొదిమెళ్లలో ఏపీసీఎన్ఎఫ్ సభ్యురాలు ప్రియాంక, నాగబాబు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వేణు, నాగరాజు రైతులకు ప్రకృతి సిద్ధమైన కషాయం తయారీని వివరించారు. పంటచేలు, తోటలపై రసాయనాల వాడకం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. రైతులు ప్రకృతి సేద్యంపై మక్కువ చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పర్యావరణానికి మేలుతో పాటు పెట్టుబడి తగ్గుతుందన్నారు. వేపగింజలు, పాల ఇంగువ కలిపి చేసిన కషాయాలతో వరిచేలపై తెగుళ్లు నివారించవచ్చని చూపించారు. అనంతరం రైతులతో కలిసి డ్రోన్ ద్వారా కషాయం వరిచేలపై పిచికారీ చేశారు.

దేశసేవకు గాడిచర్ల జీవితం అంకితం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీవితమంతా దేశసేవకు అంకితం చేసిన ఆంధ్రా తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు విద్యార్థిగా ఉండగానే బిపిన్ చంద్రపాల్ ప్రసంగాలకు ఉత్తేజితులై స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని మొదటి రాజకీయ ఖైదీ అయిన గొప్ప వ్యక్తి అని గ్రంథాలయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ వెంకటేశ్వరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధులు, గ్రంథాలయోద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 141వ జయంతి కార్యక్రమం స్థానిక జింగిల్ బెల్స్ స్కూల్‌లో శనివారం స్కూల్ డైరెక్టర్ వి.సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సామాజిక కార్యకర్త కేబీ రావు, స్కూల్ ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి మాట్లాడారు.